పులకరించింది. నేడు నాకోరిక యీడేరే సుదిన మబ్బిం దిగదా అని సంతోషించాడు తనలో తాను.

సౌందర్యం హార్మోనియంలో శ్రుతికలిపి జగన్మోహనంగా మోహనరాగ మాలాపించింది. సుందరం రాగ తరంగాల్లో తేలి యాడుచున్నట్లుగా తలంచాడు. యీ కన్యతో ప్రణయడోలికలలో పూగుచున్నాను అనుకొనే రోజులు ముందున్నవిగదా యని సంతోషించాడు. వెన్నెల్లో చెట్టాపట్టాలువేసుకొని వుద్యానవనంలో విహరిస్తున్నట్టనుకున్నాడు. నిలువునా ఆనందమైపోయాడు.

పిల్ల పాటాపివేసింది. మూడుని మేషాలు నిశ్శబ్దంగా వున్నారంతా.

ఇంతలో గ్రామమునసబు రంగనాథంగారు సుందరాన్ని దగ్గరకు పిలిచి, "నాయనా, పిల్లనచ్చిందా! నీకు? నాన్నగారియిష్టం కావాలా?" అని ప్రశ్నించాడు నెమ్మదిగా.

"తాతగారూ! నాకు పిల్లవచ్చింది; సందేహం యేమీ లేదు. ముహూర్తం పెట్టించేస్తే నేను వెళ్ళి అన్నీ సిద్ధంచేసుకొని మా బంధువుల్ని తీసుకొనివస్తాను. నావివాహవిషయంలో మా నాన్న సర్వస్వతంత్రం నాకిచ్చినకారణంచేత నాయిష్టమైతే చా" లన్నాడు సుందరం. కిత్తయ్యగారు నెమ్మదిగా సౌందర్యంవద్దకు జరిగి "అమ్మా! నీకీయన నచ్చారా?" అన్నారు "నాకీయనవద్దు" అని లేచి వెళ్ళి పోయింది సౌందర్యం.

సుందరంమనస్సు నిరాశాఘాతంచేత శతచ్ఛిద్రములైన ట్లూహించాడు. నక్కసారి అతనిభావవీథిలో యిదివరకు తాను వద్దన్న కన్యలందరూ జేరి తన్ను వేళాకోళము చేయుచున్నట్లు తోచి నిర్ఘాంత పోయాడు.

---

# నాటిగీతి

సహదేవ సూర్యప్రకాశరావు గారు

దినదినాలు యుగాల వేదనల తీయ
తేనియల నాని జీవగీతికల రాసి
రాసివోయగా, స్వప్నాల మోసికొనుచు
నవ్వు ప్రాతస్తుషారకణాల పూలు.

పూయు కుసుమాల కోసమై రేయినీలి
చలువకడుపులో కలత నిద్రల మునింగి
కలలమబ్బు త్రుళ్ళింతల కలగిపోతి
ఫలితహాసాల ఎగయూర్పుకలకలాల.

ఇదియె మొదలేమొ, ఇసుమంత యివురువిరియ
లేనిదివసమ్ము, శుభ శారదానిలమ్ము
చిలుకరించని నీరవజీవితమ్ము
కలపికోలేని కుంఠిత గళరవమ్ము.

ఇంత మధురించి అంత జీవించి ఇట్టి
పాడు వల్లకాడైనది బ్రదుకు బ్రదుకు
చూపుకొననేని కలగనిసుప్తి నేని
కురియబోదేమి సౌహార్దసురభి రేఖ.

మండువేసవి కార్చిచ్చు నిండు జీవి
తంపుకొన మ్రోసిపోయిన తారకావి
పంచికా చకిత మిహికాపదము వీడి
సోలినది మేన మలినాశ్రుశోకగీతి.

నాటి కడగంటి వలపు కన్నీటిపాట
మొరసి పోవక, హృదయాన మూగవారి
జీరువారిన పచ్చ కర్పూరవిరహ
వేదనాకపోల పదాల సేదనీరు.

వృద్ధ హేమంతు బిగికౌగిలింతలందు
మంచు జల్లుల వలపులు మాసిపోవ
నేల జీరాడి మృత్యుపదాల బడితి
నవవసంత కల్యాణ మెన్నటికి లేక.

---